సాక్షి
జగిత్యాల
శనివారం । 16 । డిసెంబర్ । 2023



పులకించిన గోదావరి

ధర్మపురి: షష్టిమాసం సందర్భంగా శుక్రవారం వేలాది మంది భక్తులు తరలివచ్చి ధర్మపురి గోదావరినదిలో స్నానాలు ఆచరించారు.

ప్రత్యేక పూజలు



ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారిని పూలతో చూడముచ్చటగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0/17.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. శుక్రవారం విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ జిల్లా కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యాధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. తొలిమెట్టు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఈ సంవత్సరం ఉన్నత పాఠశాలలో ప్రవేశపెట్టి అనుసరిస్తున్న ఉన్నతి కార్యక్రమాల లక్ష్యాలను విద్యార్థులకు అందేలా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ బోధనాపరమైన ఇబ్బందులుంటే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి «లక్ష్య» కార్యక్రమంలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను సాధిస్తూ జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ దివాకర, డీఈవో జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాలటౌన్: గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ మైగ్రేంట్స్(ఐఓఎం), నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ (న్యాక్) ఆధ్వర్యంలో ఉచిత ఉపాధి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి బింగి సత్యమ్మ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. విదేశాల నుంచి తిరిగి వచ్చిన కార్మికులు సెంట్రింగ్ కార్పెంటర్ 50 మందికి, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ 30, జనరల్ ప్లంబర్ 50, బార్ బెండర్స్ స్టీల్ ఫిక్సర్ 60, తాపీమేస్త్రీ 60 మంది ఆయా అంశాల్లో శిక్షణ పొందేందుకు అర్హులని పేర్కొన్నారు. 15రోజుల పాటు నిర్వహించే ఉచిత శిక్షణతో పాటు భోజన వసతి కల్పిస్తారని, శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్ అందజేస్తారని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 18 సాయంత్రం 5గంటల లోపు జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం లేదా నూకపెల్లి న్యాక్ శిక్షణ కేంద్రం నూకపెల్లి, రాయికల్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 94913 22556, 70367 23800 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మట్టి అక్రమ తవ్వకాలను నియంత్రించండి



జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్/జగిత్యాల రూరల్: ఎలాంటి అనుమతులు లేకుండా జిల్లాలో సాగుతున్న మట్టి అక్రమ తవ్వకాలను నియంత్రించి పర్యావరణాన్ని కాపాడాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. ఎమ్మెల్సీ ఈమేరకు శుక్రవారం కలెక్టర్‌కు లేఖ రాశారు. ప్రజాప్రయోజనం పేరిట జిల్లాలోని రెవెన్యూ భూములు, గుట్టల నుంచి జేసీబీలతో రేయింబవళ్లు మట్టి తవ్వుతూ అక్రమ రవాణ చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. జిల్లాలోని పలు చోట్ల ప్రభుత్వ భూములు, అటవీశాఖ భూములతో పాటు జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్, కల్లెడ, జాబితాపూర్, హబ్సీపూర్, మోరపల్లి, తాటిపల్లి, చల్‌గల్, నర్సింగాపూర్, మోతె, గుట్రాజీపల్లి, అంతర్గాం, ఒడ్డెరకాలనీ తదితర గ్రామాల్లోని ప్రభుత్వ బూముల్లో అనుమతులు లేకుండా గుట్టలను యథేచ్ఛగా తవ్వేస్తున్నారని అన్నారు. కొన్ని చోట్ల పొందిన అనుమతులకు మించి మట్టి తవ్వకాలు చేస్తున్నారని అదే సమయంలో గుట్టలకు ఉన్న చెట్లను సైతం తొలగిస్తున్నారని దీంతో పర్యావరణ సమతుల్యం దెబ్బతినే అవకాశం ఉందన్నారు. వీటన్నింటిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టరుకు రాసిన లేఖలో జీవన్‌రెడ్డి కోరారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీఈటీ

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని అర్పపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 11న హుజూరాబాద్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి హాకీ పోటీల్లో అర్పపల్లి పాఠశాలకు చెందిన బుక గణేశ్, చిర్రం ప్రశాంత్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 16,17,18వ తేదీల్లో కామారెడ్డిలో జరిగే పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను సర్పంచ్ కొండ శ్రీలత, వైస్ ఎంపీపీ సొల్లు సురేందర్, హెచ్‌ఎం అచ్యుతరెడ్డి, పీఈటీ షాబుద్దీన్, నాయకులు ఎండబెట్ల ప్రసాద్ అభినందించారు.

అక్రమ లేఅవుట్లు



తిమ్మాపూర్ శివారులో లేఅవుట్ లేకుండా ఏర్పాటు చేసిన ప్లాట్లు

- నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు
- నాలా చెల్లించకుండానే ప్లాట్లు
- ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు

జగిత్యాలరూరల్: జిల్లాలో పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు చేసి ప్లాట్లు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఆగస్టు 31, 2020 జీవో ప్రకారం రెగ్యులర్ లేఅవుట్ ఉండి రిజిస్ట్రేషన్ ఉన్న ప్లాట్లలో మాత్రమే నిర్మాణాలకు అనుమతి ఇవ్వాలని నిబంధనలు ఉన్నా జిల్లాలో అమలు కావడం లేదు. కాగా వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చకుండానే రియల్‌ఎస్టేట్ వ్యాపారులు లేఅవుట్లు చేస్తూ ప్లాట్లు విక్రయిస్తున్నారు. లేఅవుట్ లేనిచోట అనుమతులు ఇవ్వొద్దని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నా చాలా మంది రియల్ ఎస్టేటర్లు తమ రాజకీయ పలుకుబడితో ప్లాట్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్లాట్లు కొన్నవారు గ్రామపంచాయతీల్లో అనుమతి తీసుకుని నిర్మాణం చేసేందుకు ప్రయత్నాలు చేస్తుండగా.. అక్రమ లేఅవుట్లలో భవన నిర్మాణాలకు అనుమతించవద్దని అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో రియల్ వ్యాపారులు బెదిరింపులకు పాల్పడుతున్నారు.

విచ్చలవిడిగా ప్లాట్లు..

జిల్లా వ్యాప్తంగా అక్రమ లేఅవుట్లపై అధికారులు కొరడా ఝులిపిస్తున్నా ప్లాట్ల విక్రయాలకు అడ్డుకట్ట వేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. అక్రమ లేఅవుట్లపై రెవెన్యూ, పంచాయతీ అధికారులు కఠినంగా వ్యవహరించాల్సి ఉన్నా రాజకీయ నాయకుల జోక్యంతో పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న మండలంలోని తిప్పన్నపేటలో సుమారు 140 ఎకరాల్లో, మోతెలో 250 ఎకరాలు, ధరూర్‌లో 300 ఎకరాలు, లింగంపేటలో 40 ఎకరాలు, హస్నాబాద్‌లో 50 ఎకరాలు, తిమ్మాపూర్‌లో 70 ఎకరాలు, నర్సింగాపూర్‌లో 15 ఎకరాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా రియల్‌ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా ప్లాట్లు ఏర్పాటు చేశారు. అలాగే మెట్‌పల్లి, కోరుట్ల పట్టణాల శివారుల్లోని కొన్ని గ్రామాలు, మల్యాల మండలం ముత్యంపేట, రాజారం, కొడిమ్యాల మండలం పూడూరు, నాచుపల్లి, జగిత్యాల మండలం అంబారిపేట, హస్నాబాద్ తదితర గ్రామాల్లో అక్రమ లేఅవుట్లపై అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

విచారణ చేపడతాం



జిల్లాలో అక్రమ లేఅవుట్లపై విచారణ చేపడతాం. గ్రామపంచాయతీల్లో వ్యవసాయ భూములకు నాలా పన్ను చెల్లించి వ్యవసాయేతర భూమిగా మార్చాలి. ఆ తర్వాత లేఅవుట్ నిబంధనల ప్రకారం రహదారులుంటేనే ఇంటి నిర్మాణాలకు అనుమతి ఇస్తారు.

– దేవరాజ్, జిల్లా పంచాయతీ అధికారి

పట్టణ శివారులు, మండల కేంద్రాల్లో..

అక్రమ లేఅవుట్ ప్లాట్లు కొనుగోలు చేసినవారికి అనుమతులు ఇవ్వవద్దని రాష్ట్ర ప్రభుత్వం కొత్త జీవో జారీ చేసింది. లేఅవుట్ నిబంధన ఉండి రిజిస్ట్రేషన్ చేసుకున్న భూముల్లో మాత్రమే నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. కానీ జిల్లా కేంద్రం సమీపంలోని గ్రామాలతో పాటు ధర్మపురి, మల్యాల, తదితర మండల కేంద్రాలు, పట్టణ శివారుల్లోని గ్రామాల్లో లేఅవుట్ నిబంధనలు పాటించకుండా జోరుగా ప్లాటింగ్ చేస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు మ్యాప్‌లు వేసి రహదారులున్నట్లు కొనుగోలుదారులకు చూపిస్తూ ప్లాట్లు విక్రయిస్తున్నారు. కాగా నిబంధనలకు విరుద్ధంగా రహదారుల వెడల్పు లేకపోవడంతో రానున్న రోజుల్లో ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నాయి.

దుకాణాల తొలగింపు..చిరువ్యాపారుల ఆందోళన



దుకాణాల సామగ్రి తరలిస్తున్న బల్దియా సిబ్బంది



బల్దియా ఎదుట ఆందోళన చేస్తున్న చిరువ్యాపారులు

జగిత్యాలటౌన్: ట్రాఫిక్‌కు కారణమవుతున్నాయంటూ చిరు వ్యాపారుల దుకాణాలను బల్దియా అధికారులు శుక్రవారం తొలగించారు. జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ ఏరియాలో తాత్కాలిక షెడ్లు వేసుకుని చిన్నచిన్న వ్యాపారాలు నిర్వహిస్తున్న వారి దుకాణాలను బల్దియా అధికారులు తొలగించడంతో వారు బల్దియా కార్యాలయం గేటు వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఎలాంటి ఆధారం లేని తాము కుటుంబ పోషణకు చిన్నచిన్న దుకాణాలు నడుపుతూ జీవనం సాగిస్తున్నామని, తమ దుకాణాల తొలగింపు అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నేళ్లుగా తాము చిరువ్యాపారాలు చేసుకుని పొట్టపోసుకుంటున్నామని, ఇన్నాళ్లు లేని ట్రాఫిక్ సమస్య ఇప్పుడెందుకని అధికారులను ప్రశ్నించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న అక్రమ షెడ్ల తొలగింపునకు బల్దియా అధికారులు రెండురోజులు సమయం ఇవ్వడంతో చిరువ్యాపారులు ఆందోళన విరమించారు.

యువ కళాకారులు సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాలటౌన్: జిల్లా యువజనోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించే సాంస్కృతిక, కళా పోటీల్లో జిల్లాకు చెందిన యువ కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నైపుణ్యాన్ని చాటాలని జిల్లా యువజన, క్రీడల అధికారి కోరుకంటి రవికుమార్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 29న జిల్లా కేంద్రంలోని ధర్మపురి రోడ్డులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సాంస్కృతిక, కళా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జానపద నృత్యం–సోలో, గ్రూప్, జానపద పాట– సోలో, గ్రూప్, లైఫ్ స్కిల్స్ విభాగంలో కథా రచన, పోస్టర్ మేకింగ్, ప్రకటన, ఫొటోగ్రఫీ పోటీల్లో విజేతలను నిర్ణయించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే యువతీ యువకులు జిల్లాకు చెందిన వారై ఉండి 15 నుంచి 29 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయ పని వేళల్లో 97040 61725 నంబరులో సంప్రదించాలని కోరారు.

మహిళలు స్వయం ఉపాధి పొందాలి

జగిత్యాలరూరల్: జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులు స్వయం ఉపాధి పొందాలని జిల్లా అడిషనల్ డీఆర్డీవో శ్రీకార్ సుధీర్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో నాబార్డ్ వారి సౌజన్యంతో జనపనార సంచుల తయారీ, జ్యూట్‌బ్యాగుల తయారీపై జనవికాస గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జ్యూట్ బ్యాగుల తయారీ ద్వారా మహిళలు మంచి ఆదాయం పొందవచ్చని, ఈ రంగంలో వారికి 15 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 30 మంది స్వశక్తి సంఘ సభ్యులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. 15 రోజుల శిక్షణతో పాటు, మధ్యాహ్న భోజనం, రోజుకు రూ.50 చొప్పున రూ.750 స్టైఫండ్, సర్టిఫికెట్లు కూడా నాబార్డ్ ద్వారా అందజేయడం జరుగుతుందన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్లాస్టిక్‌ను నిషేధిస్తే జ్యూట్‌బ్యాగులకు డిమాండ్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ డీపీఎం వెంకటేశ్, సర్పంచ్ చెరుకు జాన్, ఎంపీటీసీ సునీత, ఏపీఎం గంగాధర్, జన వికాస గ్రామీణాభివృద్ధి కార్యదర్శి పెండ్లి సంపత్‌కుమార్, శిక్షణ ట్రైనర్ స్వప్న, సీసీ మరియ, వీవోఏలు రాజ్యలక్ష్మి, భాగ్యలక్ష్మి, గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు సత్తమ్మ పాల్గొన్నారు.



జ్యూట్‌బ్యాగుల తయారీ యూనిట్‌ను పరిశీలిస్తున్న సుధీర్

పెద్దగుండు వద్ద రోడ్డు ప్రమాదం

- రెండు కార్లు ఢీ..
  ఆరుగురికి తీవ్రగాయాలు

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): మెట్‌పల్లి మండలం మారుతినగర్ సమీపంలోని పెద్దగుండు వద్ద శుక్రవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కోరుట్ల మండలం జోగిన్‌పల్లి నుంచి నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి వైపు వస్తున్న కారు, మెట్‌పల్లి నుంచి జగిత్యాల వైపు వెళ్తున్న కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. రెండు కార్లలో ప్రయాణిస్తున్న ఆరుగురికి తీవ్రగాయాలు కాగా, చికిత్స నిమిత్తం జగిత్యాలలోని ఓ హాస్పిటల్‌కు తరలించినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదానికి గురైన ఓ కారులో 25 రోజుల పాప ఉందని, క్షేమంగా ఉన్నట్లు తెలిసింది. ఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

జోరుగా జీరో దందా

- జీఎస్టీ ఎగవేతకు పక్కా ప్రణాళిక
- పాతవ్యాపారి నంబర్‌తో నకిలీ బిల్లులు
- 22 జీఎస్టీ నంబర్లు వినియోగించిన సూత్రధారి
- జిల్లాలో మరిన్ని వెలుగుచూసే అవకాశం
- వాణిజ్యపన్నుల శాఖ అధికారుల అదుపులో యువకుడు

జగిత్యాల/జగిత్యాలక్రైం: జిల్లాలో బడా కాంట్రాక్టర్లు, వ్యాపారులు ప్రభుత్వానికి టాక్స్ ఎలా ఎగొట్టాలని లొసుగులు తెలుసుకుని జీరో దందాకు తెరలేపుతున్నారు. వస్తుసేవల పన్ను (జీఎస్టీ) 2017 జూలై 1న అమలులోకి వచ్చింది. జీఎస్టీ పర్సెంటేజీ ఎక్కువగా ఉండటంతో దీనిని తప్పించుకునేందుకు కాంట్రాక్టర్లు, కిరాణం, సిమెంట్, ఇటుక తదితర ఏ వ్యాపారులైనా దానిలోని లొసుగులు తెలుసుకుని ప్రభుత్వానికి టోకరా వేస్తున్నారు. జిల్లాలో ఇంకా దాదాపు రూ.1,500 కోట్ల వరకు స్కాం జరిగినట్లు ఓ అధికారి అభిప్రాయం వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో విచారణ చేపడితే మరిన్ని విషయాలు వెలుగుచూసే అవకాశాలున్నాయి.

ఎగవేత కోసమే..

బడా వ్యాపారులు, కాంట్రాక్టర్లు పెద్ద ఎత్తున వస్తువులు కొనుగోలు చేసినప్పుడు జీఎస్టీ–ఆర్1 అనగా ప్రతి నెల 11వ తేదీలోపు ఎంత కొనుగోలు చేశామనేది ప్రభుత్వానికి తెలపాల్సి ఉంటుంది. 20లోపు అన్ని క్లియరెన్స్ చేసుకోవాలి. అలాగే వీటిపై వాణిజ్య శాఖ అధికారుల పర్యవేక్షణ ఉండాలి. జగిత్యాలలో ఇంత తతంగం జరుగుతుంటే కనీసం వారికి అనుమానాలు రాకపోవడంతో అధికారులపై సైతం అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు వ్యాపారులు ఒకట్రెండు నెలలు ఎలాంటి రిపోర్ట్స్ అందజేయకపోతే అధికారులు వదిలేస్తారని, మరోనెల మాత్రం జీఎస్టీకి సంబంధించిన బిల్లులు పంపలేదని వారే నోటీసులు జారీ చేస్తారని వ్యాపారులే పేర్కొంటున్నారు. జగిత్యాలలో ఇంత జరుగుతున్నా ఎందుకు నోటీసులు పంపించలేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



జగిత్యాలలోని వాణిజ్యపన్నుల శాఖ కార్యాలయం

అధికారుల అదుపులో యువకుడు

జిల్లా కేంద్రంలో వాణిజ్య పన్నుల శాఖకు రావాల్సిన సుమారు రూ.283 కోట్ల జీఎస్టీ ఎగవేతకు సూత్రధారి అయిన యువకుడిని వాణిజ్య పన్నుల శాఖ అధికారులు గురువారం రాత్రి అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తరలించారు. వారు జగిత్యాలలో చేసిన విచారణలో ఓ ఆడిటర్ వద్ద పనిచేసిన చంద సాయి పక్కా ప్రణాళికతోనే జీఎస్టీ ఎగవేతకు పలువురికి నకిలీ బిల్లులు ఇస్తూ డబ్బులు సంపాదించాడు. ఓ వ్యాపారికి వ్యాపారంలో లాస్ రావడంతో ఐపీ దాఖలు చేసి వ్యాపారాన్ని మానుకున్నాడు. దీంతో అతడి నంబర్ ద్వారా సాయిచంద్ నకిలీ బిల్లులు సృష్టించి కొంత మందికి అప్పగించాడు. ఈ విషయం బయటకు పొక్కకపోవడంతో సుమారు 22 మంది జీఎస్టీ నంబర్లను వినియోగించి సుమారు రూ.283 కోట్ల నకిలీ బిల్లులు పలువురికి ఇచ్చాడు. ఈ విషయాన్ని జీఎస్టీ అధికారులు హైదరాబాద్‌లో గుర్తించి జగిత్యాలలో విచారణ చేపట్టగా అసలు విషయం వెలుగుచూసింది.

త్వరలో కాంట్రాక్టర్లకు నోటీసులు

జిల్లాలో రూ.283 కోట్ల జీఎస్టీ ఎగవేతకు కుట్రపన్నిన విషయం బయటపడటంతో సుమారు 36 మంది కాంట్రాక్టర్లకు వాణిజ్యపన్నుల శాఖ అధికారులు త్వరలో నోటీసులు జారీ చేయనున్నారు. వారి లావాదేవీలు కూడా గురువారం నిలిపివేశారు. అలాగే జిల్లాలో జీఎస్టీ ఎగవేతకు సూత్రధారి అయిన యువకుడు సుమారు 22 మంది జీఎస్టీ నంబర్లను వినియోగించి నకిలీ బిల్లులు ఇచ్చినట్లు అధికారులు కొన్ని ఆధారాలు సేకరించారు. మరికొన్ని ఆధారాల కోసం పూర్తిస్థాయి విచారణ నిమిత్తం యువకున్ని హైదరాబాద్‌కు తరలించారు. యువకుడు జీఎస్టీ ఎగవేతకు అతడి తల్లి పేరున ఓ సంస్థ నెలకొల్పినట్లు వాణిజ్యపన్నుల శాఖ అధికారులు అనుమానిస్తున్నారు.

ఆందోళన చెందుతున్న కాంట్రాక్టర్లు

ఆడిటర్ వద్ద పనిచేసిన వ్యక్తి మోసం చేసినట్లు తేలడంతో అతడి వద్ద బిల్లులు తీసుకున్న కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. వారి ఆడిట్ లావాదేవీలు నిలిపివేయడంతో పాటు, నోటీసులు కూడా జారీ కానుండటంతో ప్రభుత్వానికి కట్టాల్సిన జీఎస్టీ చెల్లిస్తే గానీ వారి లావాదేవీలు జరిగే పరిస్థితి నెలకొంది.

సింగరేణి కార్మికుడి నుంచి విప్ వరకు



పెగడపల్లిలో కాంగ్రెస్ నాయకుల సంబరాలు

- అంచలంచెలుగా ఎదిగిన అడ్లూరి

ధర్మపురి: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచిన ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రభుత్వ విప్‌గా నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జీవోనం.185 ద్వారా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అడ్లూరి లక్ష్మన్‌కుమార్‌తో పాటు మరో ముగ్గురు ఎమ్మెల్యేలు ప్రభుత్వ విప్‌లుగా నియమితులయ్యారు. విప్‌గా ఎన్నికైన సందర్భంగా అడ్లూరితో పాటు పలువురు ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, స్పీకర్ ప్రసాద్‌కుమార్‌లను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ విప్‌గా లక్ష్మణ్‌కుమార్ ఎన్నిక కావడంపై ధర్మపురిలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.

సింగరేణి కార్మికుడి నుంచి..

పెద్దపెల్లికి చెందిన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ విద్యార్థి దశనుంచే రాజకీయాలపై మక్కువ పెంచుకున్నారు. సింగరేణి కార్మికుడిగా ఉండి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పదవుల్లో పని చేసి అంచలంచెలుగా ఎదుగుతూ చివరకు ధర్మపురి ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రభుత్వ విప్‌గా నియమితులయ్యారు. 1982–85 వరకు గోదావరిఖని జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడిగా పని చేశారు. 1986 నుంచి 94 వరకు కరీంనగర్ జిల్లా జనరల్ సెక్రెటరీగా, 1994 నుంచి 96 వరకు యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీగా, 2001లో ఆంధ్రప్రదేశ్ జనరల్ సెక్రెటరీగా, 2006లో ధర్మారం నుంచి జెడ్పీటీసీగా పోటీ చేసి అప్పటి మాజీ మంత్రి మాతంగి నర్సయ్యపై గెలుపొందారు. 2009లో ధర్మపురి నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడు కావడంతో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి వరుసగా 2009, (2010)లో ఉప ఎన్నికల్లో, 2014, 2018లో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతిలో ఓటమిని చవిచూశారు. చివరకు 2023లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. అలాగే 2010 నుంచి 2012 వరకు జిల్లా పరిషత్ చైర్మన్‌గా, 2013– 14 వరకు పీసీసీ జనరల్ సెక్రెటరీగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా పని చేశారు.



లక్ష్మణ్‌కుమార్

మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలి

- కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాలజోన్: మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. జిల్లా కేంద్రంలోని దేవిశ్రీ గార్డెన్‌లో శుక్రవారం యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు రూ.15 కోట్ల రుణాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళలు వంటింటికే పరిమితం కాకుండా వివిధ వ్యాపారాలు చేస్తూ, మరో పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. వ్యాపారాలు నిర్వహించే మహిళలకు బ్యాంకులు విరివిగా రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయని, వాటిని ఉపయోగించుకోవాలని సూచించారు. యూనియన్ బ్యాంకు నిజామాబాద్ రీజనల్ మేనేజర్ శివకోటయ్య మాట్లాడుతూ, తమ బ్యాంకు ద్వారా మహిళలకు రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మహిళలు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకట్‌రెడ్డి, సెర్ప్ డీపీఎం మాణిక్‌రెడ్డి, మెప్మా ఏవో శ్రీనివాస్, యూబీఐ చీఫ్ మేనేజర్ సరళ్‌గుప్తా, వివిధ శాఖల మేనేజర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



మహిళలకు రుణాల చెక్కు అందజేస్తున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

స్కూల్ సమయానికి బస్సు నడిపిస్తాం



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎం వేదవతి

సాక్షి స్పందన

మల్లాపూర్(కోరుట్ల): 'బస్సు రాక.. ఇంటికి చేరలేక' శీర్షికన ఈ నెల 14న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి మెట్‌పల్లి డిపో మేనేజర్ వేదవతి స్పందించారు. శుక్రవారం మల్లాపూర్ మండల కేంద్రం శివారులోని మోడల్ స్కూల్‌ను సందర్శించారు. స్కూల్ ముగిసిన తర్వాత బస్‌షెల్టర్ వద్దకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడి ఆర్టీసీ సేవలపై తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 9న ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'మహలక్ష్మి' మహిళల ఉచిత ప్రయాణంతో ఆర్టీసీ బస్సుల్లో పెద్ద సంఖ్యలో మహిళలు ప్రయాణిస్తున్నారన్నారు. దీంతో ప్రతీ గ్రామంలో ఎక్కువ సంఖ్యలో స్టాప్‌లు ఉండడంతో బస్సుల రాకపోకల్లో కొంచెం ఆలస్యం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో మోడల్ స్కూల్ సమయవేళలకు బస్సులు రాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, మోడల్ స్కూల్ అధ్యాపకులు, విద్యార్థులను నేరుగా కలిసి ఆర్టీసీ సేవల గురించి చర్చించామని తెలిపారు. వారి సమస్యను గుర్తించి ఇకపై మోడల్ స్కూల్ ప్రారంభం, ముగిసే వేళల్లో ఆర్టీసీ బస్సులు సకాలంలో రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ ఎండీ అలీమొద్దీన్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థి


సుశాంత్‌ను అభినందిస్తున్న వి.నరేందర్‌రెడ్డి

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామ అల్ఫోర్స్ పాఠశాలలో చదువుతున్న జి.సుశాంత్ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. మంచిర్యాల జిల్లా భీమారంలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్–14 విభాగంలో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన జి.సుశాంత్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహించే పోటీల్లో సుశాంత్ పాల్గొనున్నాడు. సుశాంత్‌ను శుక్రవారం అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి అభినందించారు.

సమ్మక్క జాతర నేపథ్యంలో గర్భగుడి దర్శనాలు రద్దు

వేములవాడ: సమ్మక్క జాతర సందర్భంగా భక్తుల రద్దీ నేపథ్యంలో ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు ఆది, సోమ, శుక్ర, శనివారాల్లో రాజన్న గర్భగుడి దర్శనాలను రద్దు చేస్తున్నట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సమ్మక్క జాతరకు వెళ్లే భక్తులు ముందుగా వేములవాడ రాజన్నను దర్శించుకునే ఆనవాయితీ. ఈక్రమంలో అశేషంగా తరలివచ్చి భక్తుల రద్దీని అదుపు చేసేందుకు గర్భగుడి దర్శనాలతోపాటు ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గీతకార్మికుడికి తీవ్రగాయాలు


చికిత్స పొందుతున్న అంజయ్యగౌడ్

మెట్‌పల్లిరూరల్ (కోరుట్ల): తాటిచెట్టుపై నుంచి పడి ఓ గీతకార్మికుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. మెట్‌పల్లి మండలం చెర్లకొండాపూర్ గ్రామానికి చెందిన సుద్దాల అంజయ్యగౌడ్ రోజువారీ వృత్తిలో భాగంగా శుక్రవారం గ్రామ శివారులోని తాటివనానికి కల్లు గీసేందుకు వెళ్లాడు. తాటిచెట్టు పైకి ఎక్కి కల్లు గీసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ఒక్కసారిగా కిందపడగా తీవ్రగాయాలైనాయి. గమనించిన స్థానికులు జగిత్యాలలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. బాధితున్ని ప్రభుత్వం ఆదుకోవాలని గౌడ సంఘం అధ్యక్షుడు పెరుమాండ్ల భూమాగౌడ్, నాయకులు అరెల్ల రాజగౌడ్, జగన్‌గౌడ్, పలువురు గీత కార్మికులు కోరారు.

ఆరుగురిపై కేసు

జమ్మికుంట: భూ వివాదాన్ని మనసులో పెట్టుకొని దాడికి పాల్పడిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ బార్పటి రమేశ్ శుక్రవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన మ్యాకమల్ల వెంకటేశ్, మ్యాకమల్ల ప్రమీల, మ్యాకమల్ల రవిలపై అదే గ్రామానికి చెందిన మ్యాకమల్ల రత్నం, మ్యాకమల్ల భాస్కర్, మ్యాకమల్ల సుగుణ, మ్యాకమల్ల వెన్నెల, బండి నాగరాజు, తిప్పారపు రమేశ్ భూ వివాదాన్ని మనసులో పెట్టుకొని దాడికి పాల్పడ్డారని బాధితుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రమేశ్ తెలిపారు.

‘బెల్ట్’ బంద్!

- మూసివేయాలని యోచిస్తున్న సర్కారు
- జిల్లావ్యాప్తంగా మూడు వేల వరకు బెల్ట్‌షాపులు



కరీంనగర్ క్రైం: పల్లె ప్రజలకు నిద్రలేని రాత్రులు గడిపేలా చేస్తున్న బెల్ట్‌షాపుల నిర్వహణకు ప్రభుత్వ క్లెం వేసేలా చర్యలకు ముందడుగు వేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా బెల్ట్‌షాపులు ఎత్తివేసేలా సర్కారు నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిసింది. జిల్లావ్యాప్తంగా సుమారుగా మూడువేల వరకు బెల్ట్‌షాపులుండగా రూ.కోట్లలో వ్యాపారం సాగుతోంది. పల్లెల్లో పదుల సంఖ్యలో కిరాణషాపులు, హోటళ్లలో బాహటంగానే దందా నడుస్తోంది. అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులకు అడ్డుకట్ట వేయాల్సిన ఎక్సైజ్ అధికారులు ‘మామూలు’గా తీసుకుంటూ ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

మద్యానికి బానిసలుగా..

- గ్రామాల్లో బెల్ట్‌షాపుల పేరిట మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఏ సమయంలోనైనా మద్యం అందుబాటులో ఉండడంతో కూలీలు మొదలుకుని రైతులు, ఇతర వ్యాపారాలు చేసుకునే వారు కష్టపడి సంపాదించినదాంట్లో ఎక్కువశాతం తాగడానికే వెచ్చించడంతో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి.
- వైన్స్‌లు నిర్ణీత సమయాల్లో మూసివేస్తున్నా.. బెల్ట్‌షాపులకు నియంత్రణ లేకపోవడంతో యువత ఎక్కువశాతం బానిసలవుతున్నారని మహిళల నుంచి ఆవేదన వ్యక్తమవుతోంది. దీనికి అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.
- బెల్ట్‌షాపులను మూసివేయాలని పలుమార్లు మహిళలు, వివిధ సంఘాల నుంచి ఆందోళనలు, నిరసనలు వ్యక్తమైన నేపథ్యంలో బెల్ట్‌షాపులపై ఎక్సైజ్‌శాఖ చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. బెల్ట్‌షాపులు నిర్వహించేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసేదిశగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం.
- అసెంబ్లీ ఎన్నికల సమయంలో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు అన్ని బెల్ట్‌షాపులు మూసివేయించారు. కోడ్ ముగియగానే మళ్లీ బెల్ట్‌షాపుల దందాలకు రెక్కలొచ్చాయి. జిల్లావ్యాప్తంగా పల్లెల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. బెల్ట్‌షాపులకు సంబంధించిన అధికారుల మామూళ్ల విషయం వైన్స్ నిర్వాహకులే చూసుకుంటున్నట్లు తెలిసింది.
- రూరల్‌ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు కొందరు ఈ వ్యవహారాన్ని మామూలుగా తీసుకుంటున్నారని విమర్శలు ఉన్నాయి. పల్లెల్లో బెల్ట్‌షాపులు మూసివేసి వారికి సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

జూనియర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు



సిరిసిల్లలో ఎంపికైన అథ్లెట్స్‌తో నిర్వాహకులు

- జాతీయస్థాయికి 13 మంది ఎంపిక

సిరిసిల్ల: సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మినీస్టేడియంలో శుక్రవారం జూనియర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. అండర్–14, అండర్–16 విభాగాల్లో ప్రతిభ చూపిన 13 మంది క్రీడాకారులను జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఫిబ్రవరిలో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిక్కాల రామారావు, ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ తెలిపారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారికి రాష్ట్ర పరిశీలకుడు వెంకటస్వామిగౌడ్ చేతుల మీదుగా మెడల్స్ అందించారు. వ్యాయామ ఉపాధ్యాయులు అజయ్‌కుమార్, సాయికృష్ణ, బాబు, శ్రీనివాస్, రాజు, అసోసియేషన్ ఈసీ మెంబర్స్ నల్వాల రవి, మహిపాల్ యాదవ్ పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన అథ్లెట్‌కు మెడల్ బహూకరణ


సిరిసిల్ల మినీస్టేడియంలో అథ్లెటిక్స్ పోటీలు

అత్యవసర పనులకు ప్రాధాన్యం

- సామాజిక తనిఖీ ప్రజావేదికలో డీఆర్‌డీవో శ్రీలత



ప్రజావేదికలో పాల్గొన్న డీఆర్‌డీవో శ్రీలత, ఎంపీపీ లక్ష్మయ్య తదితరులు

కరీంనగర్‌రూరల్: ఉపాధిహామీ పథకంలో ప్రజలకు ఉపయోగపడే అత్యవసర పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని డీఆర్‌డీవో శ్రీలత అన్నారు. కరీంనగర్ మండలంలో 17గ్రామపంచాయతీల పరిధిలో 1ఏప్రిల్ 2022 సంవత్సరం నుంచి 31మార్చి 2023 సంవత్సరం వరకు ఉపాధిహామీ పథకంలో రూ.2,82,28,095 నిధులతో చేపట్టిన 443 పనులు, పంచాయతీరాజ్‌శాఖలో రూ.2,83,43,035 సంబంధించిన 99 పనులకు సంబంధించిన రికార్డులను ఈ నెల 4నుంచి 14వరకు సామాజిక తనిఖీ బృందాలు పరిశీలించాయి. శుక్రవారం కరీంనగర్ మండల పరిషత్తు కార్యాలయంలో 13వ విడత సామాజిక ప్రజావేదికను నిర్వహించారు. గ్రామపంచాయతీ వారీగా ఉపాధిహామీలో చేసిన పనులు, కూలీలకు కల్పించిన పనిదినాలు, చెల్లించిన వేతనాలు, బిల్లుల చెల్లింపుల్లో జరిగిన వ్యత్యాసాలను తనిఖీ బృందాల సభ్యులు చదివి వినిపించారు. అక్రమంగా చెల్లించిన నిధులను చట్టప్రకారం రికవరీ చేస్తామని డీఆర్‌డీవో శ్రీలత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ టి.లక్ష్మయ్య, వైస్ ఎంపీపీ వి.నారాయణ, డీఆర్‌డీవో ఏపీడీ సంధ్యారాణి, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, ఏపీవో శోభారాణి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


రోహిత్(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండల కేంద్రానికి చెందిన భూషణవేన రోహిత్(24) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గురువారం రాత్రి మల్యాల గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఇప్పలపల్లెరెడ్డి ఫంక్షన్‌హాల్ సమీపంలో బైక్ అదుపుతప్పి బండరాళ్లపై పడ్డాడు. ఈప్రమాదంలో రోహిత్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో యువకుడు బట్టల మహేశ్‌కు గాయాలయ్యాయి. మృతుడి తండ్రి భూషణవేన లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి):ఇదులాపూర్ గ్రామానికి చెందిన యాలాల గట్టయ్య((56) గురువారం రాత్రి ఇంటి ఎదుట పందిరికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. మతిస్థిమితం కోల్పోయి ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య మల్లమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఆయన వివరించారు.

గర్రెపల్లిలో వృద్ధుడు..

సుల్తానాబాద్‌రూరల్:గర్రెపల్లి గ్రామానికి చెందిన అవుల మల్లయ్య(90) గురువారం రాత్రి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కథనం ప్రకారం.. మల్లయ్యకు ఒద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్దకొడుకు అంజయ్య మల్లయ్యను పోషిస్తున్నాడు. చిన్న కుమారుడికి వివాహమైనా.. ఇప్పటికే విడాకులయ్యాయి. దీంతో అతడు ఇంటికి రావడంలేదు. ఈ క్రమంలో మల్లయ్య భార్య సుమారు మూడేళ్లక్రిత చనిపోయింది. అప్పటినుంచి మల్లయ్య మనస్తాపంతో ఉంటున్నాడు. గురువారం రాత్రి ఇంటి సమీపంలోని చేతబావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం పెద్దకొడుకు వేతికినా జాడ కనిపించలేదు. అనుమానంతో బావిలో చూడగా మృతదేహం కనిపించింది. ఈమేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై విజేందర్ తెలిపారు.

జీవితంపై విరక్తితో..

రామగుండం:అంతర్గాం మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన మెరె చంద్రమొగిలి(45) మద్యానికి బానిసై జీవితంపై విరక్తితో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు అజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్నట్లు ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

మల్యాల(చొప్పదండి): తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చోరీ చేసిన ఘటన మల్యాల మండలం తాటిపల్లిలో జరిగింది. తాటిపల్లికి చెందిన కస్తూరి విశ్వనాథం మూడురోజుల క్రితం ఇంటికి తాళం వేసి జగిత్యాలకు వెళ్లారు. శుక్రవారం ఇంటికి వెళ్లగానే తాళం పగులగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లిచూడగా, వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో దాచిన 5 తులాల బంగారంతోపాటు 3 తులాల హారం, మరో రెండు తులాల నగలు ఎత్తుకెళ్లినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఎస్సై కుమారస్వామి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వివాహిత ఆత్మహత్య

కరీంనగర్‌రూరల్: అనారోగ్య సమస్యలతో ఓ వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌కు చెందిన ఇరుమల్ల మహేశ్‌కు పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం దూళికట్టకు చెందిన రమ్యతో 2017 సంవత్సరంలో వివాహం జరిగింది. వీరికి కుమారుడు(3), కూతురు(1) ఉన్నారు. గత కొన్ని రోజుల నుంచి రమ్య అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. గురువారం రాత్రి కూడా తల్లిదండ్రులకు కడుపునొప్పి ఉందని రమ్య ఫోన్ చేసి చెప్పగా.. తెల్లవారి వస్తామని చెప్పారు. అయితే అదేరోజు రాత్రి రమ్య సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని తండ్రి బీరయ్యకు రమ్య మామ ఓదెలు ఫోన్ చేసి చెప్పాడు. శుక్రవారం రమ్య మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తన కూతురు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆత్మహత్య చేసుకుందని తండ్రి బీరయ్య చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కరీంనగర్‌క్రైం: రోడ్డు ప్రమాదంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం నగరంలోని వావిలాలపల్లి ప్రాంతంలోని ఓ బార్ ఎదుట గురువారం ఉదయం రోడ్డు ప్రమాదం జరగగా ఓ వ్యక్తి గాయపడ్డాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి గాయపడిన వ్యక్తిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతను మృతిచెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. మృతుడి వయసు సుమారు 45 నుంచి 50ఏళ్ల వరకు ఉంటుందని, సంబంధికులు ఉంటే త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

మరుగుదొడ్ల పరిస్థితిపై అంచనా

- స్వశక్తి సంఘాలకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న సీడీఎంఏ బృందం

కరీంనగర్ కార్పొరేషన్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అన్ని మున్సిపాలిటీ పబ్లిక్ టాయిలెట్స్ వాస్తవ పరిస్థితిని అంచనా వేసేందుకు సర్వే చేయాలని హైదరాబాద్ నుంచి వచ్చిన సీడీఎంఏ బృందం సూచించింది. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా పబ్లిక్ టాయిలెట్స్‌ను మెరుగు పరిచేందుకు కేంద్రప్రభుత్వం సర్వేచేపట్టింది. ఎంపికచేసిన స్వశక్తి మహిళా గ్రూపులకు శుక్రవారం నగరపాలకసంస్థ సమావేశ మందిరంలో సీడీఎంఏ బృందం సభ్యులు శిక్షణ ఇచ్చారు. స్వశక్తి మహిళలు తమ పరిధిలోని పబ్లిక్ టాయిలెట్స్ వద్దకు వెళ్లి నల్లా వస్తుందా, శుభ్రంగా ఉందా తదితర అంశాలు ఫొటోలు, వీడియోలు తీసి స్వచ్ఛసర్వేక్షణ్ టాయిలెట్ క్లీన్ యాప్ లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు, వరంగల్ జిల్లా నుంచి 60 మంది ప్రతినిధులు, నగరపాలకసంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

వాహనంతో ఢీకొట్టినవ్యక్తిపై కేసు

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలం కమ్మునూర్ గ్రామంలో ఓ వ్యక్తిని ద్విచక్రవాహనంతో ఢీకొట్టిన వ్యక్తిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్సై గౌతంపవార్ కథనం ప్రకారం.. కమ్మునూర్‌కు చెందిన తాటి భూమయ్య తన ఇంటి ముందు నిలబడి ఉండగా, తాళ్లధర్మారం గ్రామానికి చెందిన ఎరగట్ల రాములు ద్విచక్రవాహనంపై వెళ్తూ భూమయ్యను ఢీకొట్టాడు. దీంతో భూమయ్యకు గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రాములుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నలుగురు బీజేపీ నేతలకు సెన్సార్ బోర్డులో చోటు

కరీంనగర్‌టౌన్: కేంద్ర సెన్సార్ బోర్డులో కరీంనగర్ జిల్లాకు చెందిన బీజేపీ నేతలకు చోటు కల్పించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు భాస్కరాచారి, జిల్లా అధికార ప్రతినిధి బొంతల కల్యాణ్‌చంద్ర, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి బండారి గాయత్రి, సీనియర్ నాయకులు లడ్డు ముందడాలు బోర్డు మెంబర్లుగా నియమితులయ్యారు. ఈ మేరకు సంబంధిత అధికారులు వారికి సమాచారాన్ని అందించారు. సెన్సార్ బోర్డు మెంబర్లుగా అవకాశం కల్పించినందుకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కుమార్‌కి వారు ధన్యవాదాలు తెలియజేశారు.

క్వింటాల్ పత్తి రూ.6,700

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర గరిష్టంగా రూ.6,700 పలికింది. శుక్రవారం మార్కెట్‌కు 132 వాహనాల్లో 1,307 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తెచ్చారు. మోడల్ ధర రూ.6,500, కనిష్ట ధర రూ.6,000 పలికింది. గన్నీ సంచుల్లో 12మంది రైతులు 21 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తెచ్చారు. గరిష్ట ధర రూ.6,300, మోడల్ ధర రూ.6,200, కనిష్ట ధర రూ.6,000కు ప్రైవేటు ఖరీదు వ్యాపారులు కొనుగోలు చేశారు. మార్కెట్‌లో సీసీఐ సంస్థ 73మంది రైతుల నుంచి 1184.60 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది. గరిష్ట ధర రూ.7,020, మోడల్ ధర రూ.6,995, కనిష్ట ధర రూ.6,739 పలికింది. మార్కెట్‌కు శని, ఆదివారాలు సాధారణ సెలవులు ఉంటా యని, సోమవారం యార్డులో క్రయవిక్రయాలు యాథావిధిగా కొనసాగుతాయని కార్యదర్శి గూగులోతు రెడ్డినాయక్ పేర్కొన్నారు.

జాతీయస్థాయి సెపక్‌టక్రా పోటీలకు పారమిత విద్యార్థి


విశ్వేష్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లాకేంద్రంలోని పారమిత ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బి.విశ్వేష్ అండర్–16 బాలుర విభాగంలో జాతీయస్థాయి సెపక్‌టక్రా పోటీలకు ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయుడు బాలాజీ తెలిపారు. ఇటీవల పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సెపక్‌టక్రా చాంపియన్‌షిప్ పోటీల్లో బి.విశ్వేష్ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. ఈనెల 16,17,18 తేదీల్లో పంజాబ్‌లోని ధూరీలో జరిగే 2వ సబ్‌జూనియర్ జాతీయపోటీల్లో పాల్గొననున్నాడు. బి.విశ్వేష్‌ను పారమిత విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, రాకేశ్ రశ్మిత, అనుకర్ రావు, వినోదరావు, హనుమంతరావు, వీయూఎం.ప్రసాద్ అభినందించారు.

నెక్ ఉమ్మడి జిల్లా చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డి


నెక్ కార్యవర్గాన్ని అభినందిస్తున్న సభ్యులు

కొత్తపల్లి(కరీంనగర్): నేషనల్ ఎగ్ కో ఆర్డినేషన్ కమిటీ (నెక్) ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్మన్‌గా సంకిటి శ్రీనివాస్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కరీంనగర్‌లో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రిటర్నింగ్ అధికారి పి.శ్రీనివాస్ వెల్లడించారు. నెక్ జిల్లా వైస్ చైర్మన్‌గా కె.శ్రీనివాస్, కోశాధికారిగా పి.నరసింహారెడ్డి, సభ్యులుగా టి.తిరుపతిగౌడ్, బాపురెడ్డిలు ఎన్నికయ్యారు. చైర్మన్ సంకిటి మాట్లాడుతూ పౌల్ట్రీ ఫార్మర్స్ సహకారంతో సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో డా.జయరాములు, రమణారెడ్డి, పౌల్ట్రీ ఫార్మర్స్ పాల్గొన్నారు.

గోపాల్‌రావుపేటలో గుడుంబా జోరు


గుడుంబా మత్తులో రోడ్డుపై పడిపోయిన వ్యక్తిని లేపుతున్న పోలీసు

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం గోపాల్‌రావుపేట గ్రామంలో గుడుంబా విక్రయాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. జగిత్యాలతో పాటు, చుట్టుపక్కల గ్రామాల వారు గుడుంబా కొనుగోలు చేసి అక్కడే తాగి రోడ్డుపై పడిపోతుండటంతో మహిళలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. నిత్యం మద్యం మత్తులో పలువురు ప్రధాన రహదారులపై గొడవలకు దిగుతుండటం ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఎక్సైజ్ శాఖ అధికారులకు గ్రామస్తులు సమాచారం అందించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం నలుగురు అతిగా గుడుంబా సేవించి గొడవకు దిగి అక్కడే మద్యం మత్తులో ఓ వ్యక్తి రోడ్డుపైనే పడిపోయాడు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని సదరు వ్యక్తిని లేపి అతడి స్వగ్రామానికి తరలించారు.

ఏడు విద్యుత్ మోటార్లు చోరీ


పంపుసెట్ నుంచి మోటార్‌ను ఎత్తుకెళ్లిన దొంగలు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్, రఘురాములకోట గ్రామాల్లో ఒకే రోజు ఏడు విద్యుత్ మోటార్లను చోరీ చేశారు. రెండు గ్రామాల్లోని రైతులు చింతల గంగారెడ్డి, ముత్యాల రాజన్న, ఆరె రాజేందర్, బాస హరీశ్, తాటిపల్లి కిషన్, కొడిపల్లి దేవయ్య, సాయిల్ల మల్లయ్యకు చెందిన విద్యుత్ మోటార్లను గురువారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. కాగా నెల రోజుల నుంచి జాబితాపూర్, ధర్మారం, లక్ష్మీపూర్, పొలాస గ్రామాల్లో సుమారు 100పైగా విద్యుత్ మోటార్లు చోరీకి గురయ్యాయి. నిత్యం విద్యుత్ మోటార్లు చోరీ అవుతున్నా దొంగలను పట్టుకోవడంలో పోలీసులు విఫలమవుతున్నారు.

హెచ్‌ఎంఎస్‌తోనే కార్మికుల సంక్షేమం


మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

రామగిరి(మంథని):సింగరేణి కార్మికుల సంక్షేమం హెచ్‌ఎంఎస్‌తోనే సాధ్యమని ఆ యూనియన్ నేత రియాజ్ అహ్మద్ అన్నారు. ఆర్జీ–3 పరిధి ఏఎల్‌పీ గనిలో శుక్రవారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. విద్య, వైద్యం, కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కోసం హెచ్‌ఎంఎస్ కృషి చేస్తోందన్నారు. గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో తమ యూనియన్‌ను గెలిపించాలని ఆయన కోరారు. ఈసందర్భంగా ఏఎల్‌పీ గనికి చెందిన 40మంది కార్మికులు బ్రాంచ్ సెక్రటరీ బండారి క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో హెచ్‌ఎంఎస్‌లో చేరారు. ఈ సమావేశంలో ఏపీఏ, బెల్లంపల్లి వైస్ ప్రెసిడెంట్‌లు దాముఖ ఉమమహేశ్వర్, రాజాబాబు, ఫిట్ సెక్రటరీ రంజిత్ కుమార్, సెంట్రల్ సెక్రటరీ మెంబర్ అశోక్, నాయకులు ఇస్మాయిల్, మహమూద్‌ఖాన్, అనిల్, నవీన్, మహేందర్, రామకృష్ణ, శాంతిస్వరూప్ పాల్గొన్నారు.

విద్య, వైద్య సౌకర్యాలు మెరుగు పర్చుతాం

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య

గోదావరిఖని:బీఎంఎస్‌ను గుర్తింపు కార్మిక సంఘంగా గెలిపిస్తే కార్మికులకు విద్య, వైద్య, ఆరోగ్య సౌకర్యాల మెరుగుపర్చుతామని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. శుక్రవారం జీడీకే–2ఏగనిపై ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. గోదావరి పరీవాహకం వెంట అపారమైన బొగ్గు నిల్వలున్నాయన్నారు. కొత్త గనుల తవ్వకం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు పెంచుకునేలా కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావలసిన విద్యుత్, బొగ్గు బకాయిలు సుమారు రూ.26 వేల కోట్లు సింగరేణి యాజమాన్యానికి చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు హరీశ్, సతీశ్, రవీందర్, కుమారస్వామి, లక్ష్మయ్య, శ్రీనివాస్, వెంకటస్వామి, సాంబయ్య, మల్లేశం, శ్యాంసుందర్‌పాల్గొన్నారు.

గ్యారంటీలు తెస్తాం

గోదావరిఖని:గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో సీఐటీయూను గెలిపిస్తే 12 గ్యారంటీలు అమలు చేస్తామని ఆ యూనియన్ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు అన్నారు. శుక్రవారం జీడీకే–1, 3గని, ఓసీపీ–5పై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. సొంతింటి సమస్య పరిష్కారం, అలవెన్స్‌లపై ఆదాయపు పన్ను రికవరీ, విద్య, వైద్య సదుపాయాలు మెరుగుపర్చడం, బదిలీ వర్కర్లను పర్మినెంట్ చేయించడం, మిషన్ భగీరథ నీళ్లు అందించడం, డబుల్ బెడ్‌రూం క్వార్టర్ల నిర్మాణం కోసం కృషి చేస్తామని అన్నారు. నాయకులు మేదరి సారయ్య, మెండె శ్రీనివాస్, ఆసరి మహేశ్, తోట నరహరిరావు, గౌస్, వెంకటేశ్వర్లు, ఎస్.శ్రీనివాస్, బి.ప్రవీణ్, సతీశ్, మల్లేశ్, సంపత్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్నే దిక్కు



వేములవాడ: రాజన్న గుడి ఆవరణలో రాత్రి వేళ ఎలాంటి ఆధారం లేని అభాగ్యులు మెట్లపైనే గజగజ వణుకుతూ కాలం వెల్లదీస్తున్నారు. దక్షిణకాశీగా పేరొందిన వేములవాడలో అభాగ్యుల కోసం కనీస ఏర్పాట్లు లేకపోవడంతో రాజన్న గుడి మెట్లపైనే చలికి వణుకుతూ.. వానకు తడుస్తూ కాలం వెల్లదీస్తున్నారు. కనీసం చలి నుంచి కాపాడుకునేందుకు సరైన దుప్పట్లు కూడా లేవు.